క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు కల్పించండి



వంతరాంలో పాక కింద కూర్చున్న ఉపాధి వేతనదారులు

బలిజిపేట: ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధి వేతనదారులు కోరుతున్నారు. మండువేసవిలో రెండు పూటలా పనులు చేస్తున్నామని, వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే రెండుపూటలా పనులు చేయాలన్న నిబంధన వల్ల పథకం నీరుగారిపోయే ప్రమాదముందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు ఆరోపించారు. పనుల ప్రదేశాల వద్ద టెంట్లు, మజ్జిగ, నీరు, ఫస్ట్ఎయిడ్ సదుపాయాలు కల్పించాలన్నారు.

చర్యలు తప్పవు



యువత, సిబ్బందితో మాట్లాడుతున్న పట్టణ సీఐ పీవీవీఎస్ఎన్ కృష్ణారావు

పార్వతీపురం టౌన్: అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని పార్వతీపురం పట్టణ సీఐ పీవీవీఎస్ఎన్ కృష్ణారావు అన్నారు. పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మకమైన వార్డులైన జగన్నాథపురం, పాత రెల్లివీధి, కొత్తవలస, వివేకానంద కాలనీ, ఇందిరాకాలనీ, కొత్త బెలగాం ఏరియాలలో శనివారం పెట్రోలింగ్ చేస్తూ అక్కడ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌంటింగ్ వరకు 144 సీఆర్పీసీ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవ్వరు గొడవలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సంతోషి కుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో చేరికలకు చర్యలు



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను రాబోయే విద్యా సంవత్సరంలో భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం తెలిపారు. ఎంఈఓ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, అంగ వైకల్యం, తదితర సమస్యలతో బాధపడుతున్న చిన్నారులను భవితకేంద్రంలో చేర్పించి విద్యాబోధన అందిస్తామన్నారు. ఇందుకోసం ఐఈఆర్పీలు తిరుమలదేవి, కె. అనిత ప్రత్యేకంగా సర్వే చేస్తున్నారని చెప్పారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గంలో ఎన్నికలను పురస్కరించుకుని వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు రూరల్ సీఐ కె. రవికుమార్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక రాష్ట్ర రహదారిపై హనుమాన్ జంక్షన్, చినబోగిలి ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల్లో ఎటువంటి నిషేధిత సరుకులు, అనధికారికంగా నగదు తరలించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై జి. శ్రీనివాసరావు, హెచ్సీలు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

బొబ్బిలి: బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు సూచించారు. ప్రపంచ బాలికల అదృశ్య నివారణా దినం సందర్భంగా మండలంలోని మెట్టవలస గ్రామ సచివాలయంలో బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఈ మధ్యకాలంలో బాలికలు, చిన్నారులు, మహిళలు ఎక్కువగా అపహరణకు గురవుతున్నారని, ఎవరైనా అదృశ్యమైన వెంటనే పోలీసులు, న్యాయ సేవా కమిటీకి తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

పొలంబాట..



దేవుబుచ్చింపేట సమీపంలో దుక్కు చేస్తున్న రైతు



పొలంలో గత్తం వేస్తున్న రైతు, చిత్రంలో పనులకు వెళ్తున్న మహిళలు

అన్నదాతలు పొలంబాట పట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కొంతమంది దుక్కులు చేస్తుండగా.. మరికొంతమంది గత్తం వేసే పనిలో బిజీగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా వరి విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సిద్ధం చేసి రాయితీపై అందించేందుకు ఓ వైపు ఏర్పాట్లు చేస్తోంది. అన్నీ అనుకూలంగా మారడంతో రైతులు వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉన్నారు.

– సాలూరు

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం చంద్రమౌళి

సీతానగరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కుట్టు శిక్షణ ఎంతో దోహదపడుతుందని హైదరాబాద్ – నాంపల్లి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వి. చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈఓ జి. పద్మ అధ్యక్షతన నిర్వహించిన కుట్టు శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమౌళి అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి స్వయం ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో సీతానగరం మండల కేంద్రంలో 30 మంది, కురుపాం మండల కేంద్రంలో 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈఓ జి. పద్మ మాట్లాడుతూ.. మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులైన మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి వివిధ రకాల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారందరికీ బ్యాంక్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజరు కె. రామకృష్ణ, ,తదితరులు పాల్గొన్నారు.

రాజన్నదొర గెలుపు ఖాయం...

- ధీమా వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్ శాతం పెరగడం అధికార పార్టీకి లాభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని, లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటారని చెబుతున్నారు. పీడిక రాజన్నదొర నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చారని, అందుకే ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొన్నారని అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల ఓటర్లు సైతం వేల సంఖ్యలో ఓట్లు వేయడం రాజన్నదొరకు లాభిస్తుందనేది వైఎస్సార్‌సీపీ నాయకుల నమ్మకం. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నియోజకవర్గంలోని ప్రజలకు సుమారు 1600 కోట్ల రూపాయలకు పైగా లబ్ధి చేకూరిందని, అలాగే మరో 1300 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమమే వైఎస్సార్‌సీపీకి బలమని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు.

చిటుకువ్యాధిపై అప్రమత్తం

పాలకొండ రూరల్: వర్షాలు కురుస్తున్న క్రమంలో జీవాలను ఆశించే చిటుకువ్యాధిపై పాడిరైతులు అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రభా మానిక్యరావు సూచించారు. ముఖ్యంగా గొర్రెలు, మేకల విషయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవాలు ఈ వ్యాధిబారిన పడకుండా ఉండేందుకు తప్పనిసరిగా ఎంట్రో టాక్సీమియా(ఈటీ) వ్యాక్సిన్ వేయించాలన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియపై పశుసంవర్ధకశాఖ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. 3–6 ఏళ్ల వయసున్న మేకలు, గొర్రెల్లో అధికంగా ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని, దీనిపై రైతులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. జీవాలకు తప్పనిసరిగా టీకాలు వేయించేలా చూడాలన్నారు.

యుద్ధప్రాతిపదికన బోరు మరమ్మతులు



బోరు బాగు చేస్తున్న మెకానిక్ తిరుపతిరావు

జియ్యమ్మవలస: మండలంలోని చినతోలుమండగూడలో తాగునీటి బోరు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన శనివారం చేపట్టారు. వేసవి నేపథ్యంలో తలెత్తే తాగునీటి ఇక్కట్లు అధిగమించేందుకు ప్రతీ గ్రామానికి వెళ్లి, పాడైన బోర్లను బాగు చేస్తున్నామని మెకానిక్ తిరుపతిరావు తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలో తాగునీటి అవస్థలు ఉండకూడదన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పనులు చేయిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని గొర్లెసీతారాంపురంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, తాను మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భగవంతుడిని వేడుకున్నారు. అనంతరం అక్కడి నుంచి రామభద్రపురం, బాడంగి మండలాల్లోని పార్టీ నాయకులను కలిసేందుకు వెళ్లారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ అల్లు త్రినాధనాయుడు, బమిడిపాటి విశ్వనాధశర్మ, తెర్లాం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు సామల సింహాచలం, ప్రసాదరావు

పార్వతీపురం టౌన్: పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు – నేడు పనులు పూర్తి చేసేందుకు సీఆర్ఎంటీలు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మండల విద్యాశాఖాధికారులు సామల సింహాచలం, కర్రి ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్ఎంటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, సౌకర్యాల కల్పన, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా నాడు – నేడు పెండింగ్ పనులు విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాటి ముంజులకు గిరాకీ..



తాటి ముంజులు విక్రయిస్తున్న దృశ్యం

సాలూరు: ఎండలు మండుతుండడంతో తాటిముంజులకు గిరాకీ నెలకొంది. వడగాడ్పులు, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరిబోండాలతో పాటు తాటిముంజులను ఆశ్రయిస్తున్నారు. తాటిముంజులు ఆరోగ్యకమైనవి కావడంతో ఎక్కువ మంది వీటిని తిని వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. సాలూరు మండల కేంద్రంతో పాటు పలు కూడళ్ల వద్ద తాటిముంజులను విక్రయిస్తున్నారు. డజను ముంజులు 50 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



మామిడిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ షేక్ శంఖర్

సంతకవిటి: బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని మామిడిపల్లి, మండాకురిటి, సురవరం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన.. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎటువంటి బెట్టింగ్‌లు వేయవద్దని, ఒకరికొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని తెలిపారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్కువగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయన్న సమాచారం వస్తోందని, బెట్టింగ్‌లకు పాల్పడే వారి పేర్లు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడవద్దని, అపరిచిత వ్యక్తులు అడిగితే ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్) చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ శంఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: ఎన్నికల ఫలితాలపై ఎటువంటి బెట్టింగ్‌లు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని కూనాయవలస, నెమలాం, సుందరాడ గ్రామాల్లోని ప్రజలతో సమావేశమైన ఆయన.. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరగడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చూసుకోవాలని గ్రామపెద్దలకు సూచించారు. ఎన్నికలప్పుడు గ్రామాల్లో ఎటువంటి ప్రశాంత వాతావరణం ఉందో ఎన్నికల ఫలితాల తర్వాత కూడా అదే వాతావరణం గ్రామాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

వరి విత్తనాలు సిద్ధం



గొడౌన్‌లో సిద్ధంగా ఉన్న విత్తనాలు

- ఏపీ సీడ్స్ మేనేజర్ పద్మ

సాలూరు రూరల్: రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏపీ సీడ్స్ మేనేజర్ డాక్టర్ ఎస్. పద్మ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని జనవరివలస వద్ద గల గొడౌన్‌లో విత్తనాలు ఉంచామని, ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికీ అందజేస్తామన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు పూర్తి స్థాయిలో విత్తనాలు పంపిణీ చేస్తామని, మిగులు విత్తనాలను విశాఖపట్నం , శ్రీకాకుళం జిల్లాల రైతులకు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. వరితో పాటు పెసలు మినుములు, వేరుశనగ, కందులు, చోలు, కొర్రల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు పిల్లి పెసర, జీలుగు, కట్టెజనుము 50 శాతం సబ్సిడీపై అందిస్తామని తెలిపారు. వరి విత్తనాలకు సంబంధించి విజయనగరం జిల్లాకు బీపీటీ, ఎంటీయూ, ఆర్ఎస్ఆర్, ఎస్ఎల్ఆర్, ఆర్‌జీఎల్ రకాలు 46,531 క్వింటాళ్లు పంపిణీ చేస్తామన్నారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో 26, 416 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉండగా.. అందులో కొన్ని గ్రామాలకు 8 వేల క్వింటాళ్ల విత్తనాలు 90 శాతం రాయితీపై ఇస్తామన్నారు. మిగిలిన గ్రామాల రైతులకు 50 శాతం రాయితీపై అందజేస్తామని తెలిపారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి అవసరమైన సూచనలు, సలహాలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్ మోహనరావు



లచ్చయ్యపేటలో చేపడుతున్న మరమ్మతులు

సీతానగరం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్ మోహనరావు అన్నారు. మండలంలో ఇటీవల వీచిన ఈదురుగాలులకు విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ మేరకు ఆయన శనివారం పలు గ్రామాల్లో పర్యటించి పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బగ్గందొరవలస గ్రామంలో ఇటీవల వీచిన ఈదురుగాలులకు విరిగిపోయిన ఎనిమిది విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే లచ్చయ్యపేట, చినబోగిలి, బూర్జ గ్రామాల్లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ క్రమంలో దైవదర్శనం చేసుకున్న భక్తులు అనంతరం పుట్టుదేవుని వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

వర్షంతో ఉపశమనం



కురుపాం మండలంలోని మొండెంఖల్ గ్రామంలో కురుస్తున్న వర్షం

కురుపాం/కొమరాడ/గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస: మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. వేసవి ఎండల కారణంగా ఇన్నాళ్లు ఉక్కపోతతో అవస్థలు పడిన ప్రజలు ప్రస్తుతం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో కాస్త ఉపశమనం పొందారు. వ్యవసాయ పనులకు కూడా ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా పండ్ల మొక్కలు

రాజాం: ఉపాధి హామీ పథకంలో న్యూ స్ట్రాటజీ వర్క్స్ అమలు జరుగుతున్నాయని, వాటితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉపాధి హామీ పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన.. న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్లతోటలు పెంచుకునేందుకు ప్రోత్సాహం, ప్రోత్సాహకం కల్పిస్తున్నామన్నారు. మొత్తం 14 రకాల పండ్లతోటల మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇవ్వనున్నామన్నారు. వీటిని నాటడంతో పాటు మూడేళ్ల పాటు పెంచుకునేందుకు ఏడాదికి రూ.35 వేల వరకు నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా అందుతాయన్నారు. మొక్కల ఫలసాయం కూడా రైతులే పొందవచ్చన్నారు. వీటితో పాటు పొలాల చుట్టూ కందకాలు తవ్వుకునేందుకు, చెట్లు, మొక్కలు చుట్టూ కూడా కందకాలు ఏర్పాటుకు రైతులకు నిధులు ఇస్తున్నామన్నారు.

ఖరీఫ్ సేద్యానికి సన్నద్ధం

- ముందస్తు ప్రణాళికలతో అధిక దిగుబడులు
- వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు
- విత్తనాల ఎంపిక, ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకం





వేసవి దుక్కుల్లో నిమగ్నమైన రైతు (ఇన్‌సెట్లో) ఎన్ని వాహిని, ఏడీ

పాలకొండ రూరల్: రానున్న ఖరీఫ్ సేద్యానికి రైతులు ఇప్పటి నుంచే ప్రణాళికతో సిద్ధం కావాలని వ్యవసాయ శాఖాధికారి ఎన్ని వాహిని సూచించారు. రైతులు తాము పండించే పంటలకు సంబంధించిన విత్తనాల సేకరణ, వేసవి దుక్కులు, భూసార పరీక్షలు వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. సీజన్‌కు సంబంధించి పక్కా కార్యాచరణతో పొలంబాట పడితే మేలైన దిగుబడులు పొందవచ్చు. భూ సారానికి అనుగుణంగా విత్తనాలను సమకూర్చుకోవాలి. నూతన వంగడాలను ట్రై చేయాలనుకుంటే ముందుగా వ్యవసాయశాఖ అధికారులను కలిసి వాటి స్థితిగతులు తెలుసుకుని నిర్ణయాలు తీసుకోవాలి. సాగులో సలహాలు, సూచనల కోసం సమీపంలోని ఆర్‌బీకేలను సంప్రదించాలని సూచించారు.

వేసవి దుక్కులు..

ప్రస్తుత వేసవిలో దుక్కులు చేపట్టడం వలన ఉపయోగాలున్నాయి. ఈ సీజన్‌లో కురిసే వర్షాల ద్వారా లభించే నీటి నిల్వలు భూమిలోకి ఇంకటం వలన విత్తనాలు వేసేందుకు పొలం అనువుగా తయారవుతుంది. భూమిలో ఉన్న కలుపు నివారణకు ఈ దుక్కులతో అంతర్గత వ్యర్థాలు పైకిరావడం వలన అవి ఎరువుగా మారుతాయి. భూమి లోపల పొరల్లో దాగి ఉన్న చీడపీడలకు కారకాలైన కీటకాలు, వాటి గుడ్లు, లార్వాలు పైకి చేరుతాయి. వాటిని తినేందుకు వచ్చే పక్షులు విసర్జించే వ్యర్థాలు కూడా భూమికి సత్తువ చేకూరుస్తాయి.

భూసార పరీక్షలు..

వేసవిలో భూసార పరీక్షలు చేపట్టడం వలన భూమిలో ఉన్న పోషక విలువలు, సారం గుర్తించే అవకాశం ముందుగానే ఉంటుంది. తద్వారా రానున్న సీజన్‌లో సేద్యానికి తగ్గట్లుగా భూమిని తయారు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగపర్చుకుని అందుకు తగ్గట్టుగా పంటల ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం సులభతరమవుతుంది. ముందస్తు జాగ్రత్తలతో చేపట్టే సేద్యం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో సమీప నీటివనరుల అభివృద్ధిలో భాగంగా కాలువల్లో పూడిక తీతలు, చిన్నచిన్న మరమ్మతులు చేపట్టడం వలన నీటి నిల్వల సామర్థ్యం కూడా పెంచుకునే అవకాశం ఉంటుంది. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు పాటించడం ద్వారా పంటల యాజమాన్యం, సస్యరక్షణ, దిగుబడి సాధించడంలో ఇబ్బందులు అధిగమించవచ్చు.